


# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబలమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి-అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.

హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పడుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్ వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)

అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.

# పాతాళభైరవి – 7

. ★★★

మాంత్రికుడు: ఒరే డింగరీ. మహా జనమంతా మన భక్తులు. ఎవరికేమికావాలో కోరుమురా. బహుమానాలిస్తాం.

శిష్యుడు: ఇంతమందికి ఎలాగిస్తారుగురూ?

మాంత్రికుడు: పాత్రతో——ఇదుగోరా అక్షయ ఘటం. ఎవరికేమికావాలో కోరుమురా.

శిష్యుడు: కికూకాకూ కకూకీకే.. ఈ బోసినోటి తాతయ్యకి ఒక అరటిపండు ఇవ్వండి. –నవ్వులు.

మాంత్రికుడు: ఘటం బోర్లించిచూపి... హుం.——ఘటంపై చెయ్యితిప్పి –అరటిపండు కావాలి. –ఘటం లోంచి అరటిపండు తీసి శిష్యునివైపు విసురుతాడు.

శిష్యుడు: గిగీగాగా గగాగీగీ.. ఒకమరుగుజ్జుదాన్ని చూసి: ఈ ముద్దుగుమ్మకి ఒక కుంకంబరిణె ఇవ్వండి.

మాంత్రికుడు: చెయ్యి తిప్పి: కుంకంబరిణె కావాలి. ఘటం లోంచి కుంకంబరిణె తీసి శిష్యునివైపు విసురుతాడు.: ఇదుగోరా.

అంజి:మామామూమూ మూమూ మామే ..మాంత్రికుడుగారూ. నాకు దోసెడు వరహాలు ఇప్పించండి. ఇహిహి.

మాంత్రికుడు: నచ్చినావురా. మెచ్చినానురా. ఘటంపై చేతులుతిప్పి: వరహాలు కావాలి. –అంజి చేతిలో వరహాలు పోస్తాడు. రాము ఆశ్చర్యంతో ముందుకు వస్తాడు.

మాంత్రికుడు: ఆగండి.అందరికీ ఇస్తాం. వరహాలు పంచుతుంటే రాము ఒడుపుగా, దుస్సాహసంగా ఘటం ఎత్తుకుపోతాడు. మాంత్రికుడు శిష్యుడితో సంప్రతించి రాము వైపు అంగలు వేస్తాడు.

★★★

అలసి డస్సిన రాముడు ఊరవతల చిట్టడవిలోకి పోయి నీరసించిన గొంతుతో: కీకీకాకే కాకీకూకే.. మణులు కావాలి. మాయా ఘటంలో చెయ్యి జొనుపుతాడు. ఏమీ రాలవు. గాగాగీగీ గూగూగాగే.. రత్నాలు కావాలి. అదే తిరిగి చేస్తాడు. ఏమీ అభ్యం కావు. ఘటాన్ని గట్టిగాకొట్టి బోర్లించి చూస్తాడు అమాయకుడు. కాసేపాగి మళ్ళీ——కీకీకాకే కాకాకీకూ.. వరహాలు కావాలి. ఏమీ రాలవు. కోపంతో ఘటాన్ని నేలకేసి కొడతాడు. ఉక్రోషంతో. నేపథ్యంలో –హహ్హహ్హా. దూరం నుండి వికటాట్టహాసం చేస్తూ మాంత్రికుడు వస్తాడు.

మాంత్రికుడు: అందులో ఏముందిరా డింభకా. అంతా మా మంత్ర శక్తిలో వుందిరా.——దగ్గరికి వచ్చి: తెలుసుకున్నానురా.నీ మనసులోని మర్మమంతా. మేడెక్కావుకదరా ఉజ్జయినీ రాకుమారిది? – రాము చేతులుకట్టుకుని తీవ్రంగా చూస్తాడు. –

మాంత్రికుడు:  భవనాలు,పల్లకీలు, పరివారాలు తెస్తే పిల్లనిస్తానన్నాడుకదరా రాజు? ప్రేమించేవుకదరా ఉజ్జయినీ రాజకుమారిని?

రాము విస్మయంతో: ఔను.

మాంత్రికుడు: సన్మార్గుడివిరా డింభకా! సన్మార్గులకి సహాయం చెయ్యడమే మా ధర్మం. నీ కోరికలుతీరే కీలకం చూపిస్తాను. సాహసం చేయగలవురా? –రాము అతడిముందు మోకాళ్ళపై కూర్చుని మోకరిల్లి: మీరేం చెయ్యమన్నా చేస్తాను. ( Total surrender)

మాంత్రికుడు: భలే డింభకా భలే. జై పాతాళ భైరవీ. పదరా.

పాట:

ప్రేమ కోసమై వలలో పడెనే పాపం పసివాడు...

అయ్యో పాపం పసివాడు

వేమరు దేవుల వేడుకుని తన కొమరుని క్షేమం కోరుకుని

ఏమైనాడో – ఏమౌనోయని కుమిలే తల్లిని కుములుమనీ "ప్రేమ"

ప్రేమకన్ననూ పెన్నిధియేమని యేమిధనాలిక తెచ్చుననీ

భ్రమసి చూచు ఆ రాజకుమారిని

నిముసమె యుగముగ గడుపుమనీ "ప్రేమ"

ప్రేమలు దక్కని బ్రతుకేలాయని ఆ మాయావిని నమ్ముకుని

ఏమివ్రాసెనో... అటు కానిమ్మని బ్రహ్మదేవునిదె భారమనీ "ప్రేమ"

================================================

ఇద్దరూ మంత్రాలమర్రివద్దకు చేరుకుంటారు.

మాంత్రికుడు: జై పాతాళభైరవీ. ఇదేరా మంత్రాలమర్రి. ఇక్కడే పాతాళభైరవి నిధులతో నిరీక్షిస్తోందిరా. —ఎదురుగా చెట్టు మొదట్లో విగ్రహం పాతాళం వైపు చూపిస్తూ వుంటుంది.

రాము: ఏంటది స్వామీ?ఎక్కడుంది?

మాంత్రికుడు: భూగర్భంలో వుంది. దారిచూపిస్తాను. బెదరక వదలక పైకెక్కుమురా డింభకా. పట్టాకత్తి దూసి చెట్టువైపు ముందుకుపోతాడు రాము. ఒక పిశాచం ప్రత్యక్షమై రాముని పట్టుకోబోతుంది. రాము కత్తితో దానిని అడ్డంగా నరుకుతాడు. అది మాయమౌతుంది.

మాంత్రికుడు: భలే డింభకా.భలే. —ఉత్కంఠతో —: కొమ్మపై ఎక్కి పూర్తిగా ఇటువైపుకి రారా. —అట్లే చేస్తున్న రాము కాళ్ళు గుంజే ప్రయత్నం చేస్తుంది మరొక పిశాచం. రాము కత్తివేటు పడగానే అది మాయమౌతుంది.

మాంత్రికుడు: భలే డింభకా. భలే. సాహసివిరా. వరపుత్రుడివిరా. పాతాళబిలానికి మార్గం చేస్తున్నాను చూడరా.—– చేతులు తిప్పుతూ—– హ్రాం.హ్రీం.బబభ్రం.హ్రాం హ్రీం.బబభ్రం. మూడోసారి నేలపై మంటలు లేస్తాయి.

మాంత్రికుడు: అహ్హహ్హ. —రాము మంట వెలుగులో చుట్టూ పరికిస్తాడు.

మాంత్రికుడు: పాతాళభైరవి ప్రసన్నమౌతుంది. జయంకోరి మంటలో దూకరా. —సంశయిస్తున్న రాముతో : సంకల్పం సిద్ధిస్తుంది. రాజకుమారి లభిస్తుంది. జయంకోరి మంటలో దూకరా.——రాము తల్లిని తలచుకుని కత్తి నోటితోపట్టి మంటలో దూకుతాడు. బిలంలో నేలపై పడతాడు. నేపథ్యంలో మాంత్రికుడు: అహ్హహ్హ. భలే దింభకా. భలేభలే. బిలం నేలపై దుమ్ము,ధూళి దులుపుకుని కత్తిపట్టిలేచి నిలబడతాడు రాము. బిలంపైనుండి తాడు కిందికి పడుతుంది.

రాము: స్వామీ.ఎక్కడున్నారు?

మాంత్రికుడు: వస్తున్నానురా డింభకా. భయపడకు. —ఈలోగా రాము పరిసరాలు పరిశీలిస్తాడు. మాంత్రికుడు తాడుపట్టుకు దిగి వస్తాడు. అంతటా భయంకరమైన కూతలు,శబ్దాలు వినిపిస్తాయి.

మాంత్రికుడు: చూస్తివిరా మాయ?

రాము: అంతా అయోమయంగావుంది స్వామీ.ఎక్కడా దారికనపడదే?

మాంత్రికుడు: అహ్హహ్హా. దారిచేస్తాను చూడరా. --మాంత్రికుడు బిలంలో ముందుకు సాగుతాడు. రాము అనుసరిస్తాడు. అక్కడ ఒకచోట గోడలో ఒక విగ్రహం! కుడిచేతివేలు తన బొడ్డువైపు, ఎడమచేతివేలు తనపక్కనే నిలబెట్టిన ముళ్ళగద వైపు చూపిస్తూవుంటుంది.

మాంత్రికుడు: చూస్తివిరా బొడ్డుదేవర! ఆ ముళ్ళగద తీసుకుని పొట్ట పగలగొట్టమంటూంది. సాహసం శాయరా. –రాము అతికష్టం మీద బరువైన గదఎత్తి మూడో ప్రయత్నంలో విగ్రహం పొట్ట బద్దలకొడతాడు. అక్కడ మనిషి దూరే దారి ఏర్పడుతుంది.

మాంత్రికుడు: పదరా. –ముందు రాము, వెనకగా మాంత్రికుడు,ఇద్దరూ దూరి ముందుకు పోతారు. పోగాపోగా-- మాంత్రికుడు: అదేరా కత్తుల బోను. దాటితే పాతాళభైరవి కనిపిస్తుంది. సంకల్పం సిద్ధిస్తుంది. రాజకుమారి లభిస్తుంది. జయంకోరి సాహసం శాయరా. –సంశయిస్తూనే రాముని పురికొల్పుతాడు. రాము దైవ ప్రార్థనతో ముందుకు దూకుతాడు. కత్తులు ఒక్కొక్కటీ ఒక్కొక్క పూలమాలగా మారి అతడి కంఠం అలంకరిస్తాయి.

మాంత్రికుడు: భలే డింభకా. భలే. సాహసివిరా.వర పుత్రుడివిరా. పెళ్ళి దండలు చూస్తివిరా? –భీకర ధ్వనులు, కూతలు. మాంత్రికుడు: జై పాతాళభైరవి. దేవి పిలుస్తోంది పదరా. మెట్లుదిగి గుహ లోపలికి వస్తారు. ఓ-అని శబ్దాలు. మాంత్రికుడు: జై పాతాళభైరవి. అక్కడ 58 అడుగుల ఎత్తు భీకరమైన పాతాళభైరవి విగ్రహం. [ఆనాటి ఆ సెట్-లో ఆ విగ్రహాన్ని చూసి పెద్దలే భయభ్రాంతులైనారట!] పైకప్పునుండి వేలాడే దీపాలు, నేలపై చుట్టూ పూజా ద్రవ్యాలు.

మాంత్రికుడు: కాళీ భైరవీ- వగైరా నామాలతో దేవిని కీర్తిస్తూ——చూస్తివిరా దేవిని? మహా శక్తి పాతాళభైరవి. నేను మంత్రజపం చేసి దేవిని ప్రసన్నం చేస్తాను. నీవు మడుగులో స్నానం చేసి శుచివై రారా. దేవికి అభిషేకం చాయిస్తాను. ఊఁ. (Command)

రాము మడుగువైపు వెళ్తాడు.

★★★

★

(సశేషం)

COMMENTS